సాక్షి రాజన్న సిరిసిల్ల

శనివారం : 21 : జనవరి : 2023



యారన్ సబ్సిడీ చెల్లించాలి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): టెక్స్‌టైల్ పార్కులోని పవర్‌లూమ్ కార్మికులకు యారన్ సబ్సిడీ మంజూరు చేయాలని నాయకులు కోరారు.



కల్యాణం..కమనీయం

ముస్తాబాద్(సిరిసిల్ల): చీకోడులో శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.0/18.0

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

విజ్ఞానశాస్త్ర సెమినార్‌కు ఆహ్వానం

సిరిసిల్లఎడ్యుకేషన్: జాతీయ విజ్ఞానశాస్త్ర దినోత్సవం ఫిబ్రవరి 28న విజ్ఞానశాస్త్ర ఉపాధ్యాయులకు, ఛాత్రోపాధ్యాయులకు రాష్ట్రీయ విద్య, పరిశోధన శిక్షణ సంస్థ పలు అంశాలలో సెమినార్ నిర్వహిస్తున్నట్లు డీఈవో రాధాకిషన్ తెలిపారు. 'దేశాన్ని స్వావలంబనగా మార్చడానికి సైన్స్ సంస్కృతిని ప్రోత్సహించడం' అనే ప్రధానాంశంగా సెమినార్ ఉండనున్నట్లు వెల్లడించారు. సెమినార్‌కు సంబంధించిన పత్రాలను ఆంగ్లం లేదా తెలుగులో రాసి ఫిబ్రవరి 2వ తేదీ వరకు tgscertmathsscience@gmail.com వెబ్‌సైట్‌లో పంపించాలని సూచించారు. ఎంపికైన వారికి జాతీయ సైన్స్ దినోత్సవం ఫిబ్రవరి 28, 2022న ఎస్‌సీఈఆర్‌టీ నిర్వహించే సెమినార్‌లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. వివరాలకు డీఈవో ఆఫీస్‌లోని సైన్స్ ఆఫీసర్‌ను సంప్రదించాలని సూచించారు.


కల్యాణలక్ష్మీ ఆడబిడ్డలకు వరం



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): నిరుపేద ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మీ వరమని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ ఆఫీస్ ఆవరణలో శుక్రవారం 79 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఆగయ్య మాట్లాడుతూ నిరుపేద ఆడ కూతుళ్లకు పెద్దన్నలా సీఎం కేసీఆర్ నిలుస్తున్నారన్నారు. సీఎమ్మార్‌ఎఫ్, కల్యాణలక్ష్మీ పథకాలు ఎందరికో అండగా ఉంటున్నాయన్నారు. జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్ విండో చైర్మన్ కృష్ణారెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, తహసీల్దార్ జయంత్‌కుమార్, ఎంపీడీవో చిరంజీవి, సర్పంచులు వెంకట్‌రెడ్డి, బాల్‌రెడ్డి, ఎంపీటీసీలు నాగరాణి, అనసూయ, మాజీ ఎంపీపీ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

వేపచెట్టుకు పారుతున్న కల్లు



ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని గాలిపల్లి పశువైద్యశాల ఎదురుగా ఉన్న వేపచెట్టుకు కల్లు పారుతోంది. చెట్టుకు పారుతున్న కల్లును కుండలో పట్టి గ్రామస్తులు ఆరోగ్యానికి బాగుంటుందని గ్రామస్తులు తాగుతున్నారు. వివిధ గ్రామాల నుంచి ప్రజలు వచ్చి వేపచెట్టుకు పారుతున్న కల్లును చూసి వెళ్తున్నారు.

పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విచారణ

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని కొండాపూర్ గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగంపై శుక్రవారం విచారణ చేపట్టిన అధికారులు సర్పంచ్, ఉపసర్పంచ్ చెక్‌పవర్‌ను ఎంపీవోకు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కొండాపూర్‌లో నిధుల దుర్వినియోగం జరిగాయని గ్రామానికి చెందిన నేవూరి రత్నాకర్ సమాచారహక్కు చట్టం ద్వారా ఫిర్యాదు చేశారు. కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాలతో జిల్లా అధికారులు విచారణ చేపట్టారు. పాలనపరమైన ప్రక్రియకు విరుద్ధంగా ఖర్చు చేసినట్లు గుర్తించారు. సర్పంచ్, కార్యదర్శుల చెక్‌పవర్‌ను మండల పంచాయతీ అధికారికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఘనంగా మాసశివరాత్రి వేడుకలు



వేములవాడ: రాజన్న సన్నిధిలో శుక్రవారం మాసశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం స్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకులు తిరుపతిరావు, అల్లి శంకర్ భక్తుల ఏర్పాట్లను పరిశీలించారు.

హామీ.. నెరవేరదేమీ..!



ఇతని పేరు రాధా శంకర్. తంగళ్లపల్లి తహసీల్దార్ ఆఫీస్‌లో పనిచేస్తున్న శంకర్ గతంలో పదోన్నతులు, పేస్కేల్ కోసం సమ్మె చేశారు. పనికి తగిన వేతనం లేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు ఇవ్వాలని కోరారు. 80 రోజుల పాటు సమ్మె చేసి మంత్రుల హామీల మేరకు సమ్మెను విరమించి విధుల్లో చేరారు. కానీ వంద రోజులుగా వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించ లేదు. ఇలాంటి వారు జిల్లా వ్యాప్తంగా 470 మంది వీఆర్‌ఏలు అరకొర వేతనాలతో కాలం వెల్లదీస్తున్నారు.

- వీఆర్‌ఏలు సమ్మె విరమించి వంద రోజులు
- అమలుకాని డిమాండ్లు
- జిల్లాలో 470 మంది వీఆర్‌ఏలు



వేములవాడ రాజన్న ఆలయం ముందు వీఆర్‌ఏ జేఏసీ ఆందోళన (ఫైల్)

సిరిసిల్ల: వీఆర్‌ఏలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుకాలేదు. 80 రోజులపాటు సమ్మె చేయగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీతో సమ్మెను విరమించి వంద రోజులు గడిచింది. అయినా వీఆర్‌ఏల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. రాష్ట్రవ్యాప్తంగా వీఆర్‌ఏలు 2022 జూలై 25న సమ్మెకు దిగిన వీరు.. కలెక్టరేట్, ఆర్డీవో, తహసీల్దార్ ఆఫీస్‌ల ముందు ఆందోళనలు చేశారు. రిలే దీక్షలకు దిగారు. వంటావార్పు, బతుకమ్మ ఆటలు, అర్ధనగ్న ప్రదర్శనలతో నిరసన తెలిపారు. సమ్మె కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా 60 మంది వీఆర్‌ఏలు ప్రాణాలు కోల్పోయారు. సెప్టెంబరులో రెండుసార్లు ప్రగతిభవన్ ముట్టడికి ప్రయత్నించారు. ఇన్ని చేసిన వీరి సమస్యలు మాత్రం ఇప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదు.

మూడుసార్లు చర్చలు

వీఆర్‌ఏలు(గ్రామ సేవకులు) పార్ట్‌టైమ్‌గా నియమితులయ్యారు. ఏపీపీఎస్సీ ద్వారా 2012లో, టీఎస్‌పీఎస్సీ ద్వారా 2014లో నియమితులైన వారు ఉన్నారు. 2020లో వీఆర్‌వో వ్యవస్థ రద్దుతో వీఆర్‌ఏలో ప్రమోషన్ చానల్ తెగిపోయింది. దీంతో వీఆర్‌ఏల విధులు బహిష్కరించి సమ్మెబాట పట్టగా.. ప్రభుత్వం మూడుసార్లు చర్చలు జరిపింది. 2022 సెప్టెంబర్ 13న, సెప్టెంబర్ 20న కేటీఆర్‌తో చర్చలు జరిపారు. అక్టోబర్ 12న చివరిసారిగా మంత్రి కేటీఆర్, అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌తో చర్చలు జరిపారు. మునుగోడు ఎన్నికల కోడ్ ముగియగానే వీఆర్‌ఏల డిమాండ్లు నెరవేర్చుతామని హామీ ఇచ్చారు. దీంతో అక్టోబరు 12న వీఆర్‌ఏలు సమ్మెను విరమించారు. కానీ హామీ ఇచ్చి వంద రోజులు దాటినా ఇప్పటికీ వారి సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు.

వీఆర్‌ఏలకు పనిభారం

వీఆర్వో(విలేజీ రెవెన్యూ అధికారి) వ్యవస్థ రద్దు కావడంతో వీఆర్‌ఏ(విలేజీ రెవెన్యూ అసిస్టెంట్)లపై పనిభారం పెరిగింది. భూమికి సంబంధించిన మోఖా ఎంక్వయిరీలు, ఆ విచారణ పూర్తయిన తర్వాత రికార్డులను మండల ఆఫీస్‌లో అప్పజెప్పడం. గ్రామాల్లో అన్ని పనులు వీఆర్‌ఏలు చేయడం వంటి పనిభారం పడింది. వీఆర్వో వ్యవస్థ రద్దు కావడంతో వీఆర్‌ఏలకు ప్రమోషన్ లేకుండా పోయింది.

ఇవీ.. వీఆర్‌ఏల డిమాండ్లు:

- అందరికీ పే స్కేలు.
- అర్హత గల వీఆర్‌ఏలకు ప్రమోషన్లు.
- 55 ఏళ్లు దాటిన వీఆర్‌ఏల వారసులకు వారి స్థానంలో ఉద్యోగాలు.
- సమ్మె సందర్భంగా మరణించిన వారికి ప్రత్యేక పరిహారం.
- సమ్మెకాలం అనగా 80 రోజులు ప్రత్యేక సెలవుదినంగా ప్రకటించి వేతనం మంజూరు చేయాలి.
- సమ్మెకాలంలో రాష్ట్రవ్యాప్తంగా వీఆర్‌ఏ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి.
- వీఆర్‌ఏలపై పనిభారం తగ్గించాలి.

అరకొర జీతాలతో పనిచేస్తున్నారు



వీఆర్‌ఏలు అరకొర జీతాలతో పనిచేస్తున్నారు. ప్రమోషన్లు లేక ఏళ్ల తరబడి వీఆర్‌ఏలుగానే ఉంటున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలి. పేస్కేల్, ప్రమోషన్లు ఇవ్వాలి. ఇవన్నీ నెరవేర్చుతుందనే ఆశతో సమ్మెను విరమించి డ్యూటీలలోకి వెళ్లాం. కానీ వంద రోజులు గడుస్తున్న మా హామీలకు మోక్షం లభించడంలేదు. ఇప్పటికైనా న్యాయమైన మా డిమాండ్లను నెరవేర్చాలని కోరుతున్నాం. లేకుంటే మరో ఉద్యమం చేస్తాం.

– మల్లారం అర్జున్, వీఆర్‌ఏ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

రైల్వే స్టేషన్లకు కొత్త సొబగులు!

- కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం స్టేషన్లకు మహర్దశ
- ప్రత్యేక ప్రణాళిక ద్వారా అభివృద్ధి చేయనున్న ద.మ. రైల్వే
- ఏయే సదుపాయాలు కల్పించవచ్చో అధ్యయనం
- అమృత్ భారత్ కింద ప్రతీ స్టేషన్‌కు రూ.20 కోట్లు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: దక్షిణ మధ్య రైల్వే తన పరిధిలో ఉన్న స్టేషన్ల ఆధునికీకరణకు చర్యలు చేపడుతోంది. ఇటీవల సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజన్లలో ఉన్న అన్ని స్టేషన్లలో ట్రాకుల సామర్థ్యం గంటకు 130 కి.మీ మేరకు పెంచిన విషయం తెలిసిందే. తాజాగా తన పరిధిలో ఉన్న మొత్తం 20 స్టేషన్లలో ఆధునికీకరణ పనులు చేపట్టి, కావాల్సిన సదుపాయాలు కల్పించేందుకు సౌత్ సెంట్రల్ రైల్వే సమాయత్తమవుతోంది. సదరు 20 స్టేషన్ల జాబితాలో కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల స్టేషన్లు కూడా ఉన్నాయి. ఈ స్టేషన్లలో ప్రయాణికులకు ఏయే సదుపాయాలు కల్పించవచ్చో గుర్తించే పనిని టెండర్లు సొంతం చేసుకున్న టెక్నికల్ కన్సల్టెన్సీలు గుర్తించి, దక్షిణ మధ్య రైల్వేకు అందజేస్తాయి. సదరు నివేదికల ఆధారంగా కావాలిన్న సదుపాయాలు, పనులను ద.మ.రైల్వే చేపడుతుంది.

ఉమ్మడిజిల్లాలో మూడు స్టేషన్లు..!

- ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం స్టేషన్లు కీలకమైనవి. ఇందులో పెద్దపల్లి, రామగుండం నిత్యం రద్దీగా ఉండే స్టేషన్లు.
- రాష్ట్రంలో తిరిగే రైళ్లతోపాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఢిల్లీ తదితర ఉత్తరాది రాష్ట్రాలకు వెళ్లేందుకు ఈ రూటు ప్రధానం.
- ఇటీవల ఈ మార్గంలో మూడో రైలు మార్గం కూడా అందుబాటులోకి వచ్చింది. అలాగే.. ఈ మార్గంలో 130 కి.మీ వేగంతో వందేభారత్ రైలు వెళ్లేలా పట్టాల సామర్థ్యాన్ని దక్షిణ మధ్య రైల్వే అప్‌గ్రేడ్ చేసింది.
- తాజాగా స్టేషన్లలో సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టడం శుభపరిణామం అని పలువురు ప్రయాణికులు వ్యాఖ్యానిస్తున్నారు.
- కన్సల్టెన్సీలు ఇచ్చే నివేదికల ఆధారంగా రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు ఉన్నతాధికారులు చర్యలు చేపడతారు.
- వీటి ప్రకారం.. స్టేషన్ల సుందరీకరణ, గోడలపై స్థానిక కళారూపాలు, చిత్రాలు వేయడం, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, సైనేజ్ బోర్డులు, రెస్ట్ రూములు, వెయిటింగ్ రూములు, అదనపు, కౌంటర్లు, బెంచీలు, పార్కింగ్, లైటింగ్, హైలెవల్ ప్లాట్‌ఫారాలు, రైళ్ల రాకపోకలను తెలిపే డిజిటల్ బోర్డులు, దివ్యాంగులకు అవసరమైన సదుపాయాలు తదితరాలు కల్పిస్తారు.
- ముఖ్యంగా కరీంనగర్ రైల్వేస్టేషన్‌లో రెండో ప్లాట్‌ఫారం లేదు. అలాగే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి లేదు. ఈ సదుపాయాల కోసం కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లావాసులు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా కరీంనగర్ నుంచి తిరుపతి వెళ్లే ప్రయాణికులకు ఈ సదుపాయాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి.
- ప్రతీ ఆదివారం, గురువారం కరీంనగర్ నుంచి తిరుపతికి బయల్దేరే బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ చాలా రద్దీగా ఉంటోంది. ప్రయాణికులతోపాటు వారి బంధువులతో ఆ రెండు రోజులు స్టేషన్ కిక్కిరిసిపోతోంది.
- ఒకటే ప్లాట్‌ఫారంతో ప్రయాణికులు, వారి బంధువులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల నుంచి వచ్చిన వారి కష్టాలు చెప్పతరం కావు.

అమృతభారత్ కింద అభివృద్ధి..

అమృత్ (అటల్ మిషన్ ఫర్ రిజునవేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌మిషన్) పథకం కింద దేశంలోని 1000 చిన్న రైల్వేస్టేషన్లు అభివృద్ధి చేయాలని కేంద్రం ఇటీవల నిర్ణయించింది. ఇందులో భాగంగా ఎంపిక చేసిన స్టేషన్లలో ప్రయాణికులకు కనీసం సదుపాయాలు కల్పించేలా వాటికి అవసరాన్ని బట్టి రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్లు కేటాయించనుంది. కన్సల్టెన్సీలు పని పూర్తిచేసిన అనంతరం వాటి నివేదిక ఆధారంగా సదుపాయాల కోసం ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, రామగుండం స్టేషన్లకు కనీసం రూ.30 కోట్ల నుంచి రూ.60 కోట్లు కేటాయించే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ నివేదికల ఆధారంగా అనేక రైల్వేస్టేషన్ల ముఖద్వారాల నిర్మాణం, అదనపు భవనాల నిర్మాణం, అవసరమైతే కార్యాలయాల తరలింపు కూడా చేపడతారు.

వేగంగా కొత్తపల్లి-మనోహరాబాద్ పనులు..

హైదరాబాద్-కరీంనగర్‌ను కలిపే ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కొత్తపల్లి-మనోహరాబాద్. ఈ రైల్వే లైను ఇప్పటికే మనోహరాబాద్ నుంచి గజ్వేల్ వరకు పూర్తయ్యింది. సిరిసిల్ల జిల్లాలో సిరిసిల్ల నుంచి వేములవాడ వరకు పనులు వేగంగా నడుస్తున్నాయి. సిరిసిల్ల డివిజన్‌లోని తంగళ్లపల్లి వద్ద తమకు 37 ఎకరాలు కావాలని దక్షిణ మధ్య రైల్వే కోరగా సిరిసిల్ల కలెక్టర్ కేటాయించారు. ఈ భూమి కేటాయింపులు ఇటీవల పూర్తయ్యాయి. మరోవైపు తంగళ్లపల్లి నుంచి కొత్తపల్లి వరకు భూసేకరణ పనులు నడుస్తున్నాయి.

బోగస్ ఓటర్లను తొలగిస్తాం

- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో బోగస్ ఓటర్లను తొలగించి, తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తామని కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆధార్ నంబర్లతో ఓటర్ల అనుసంధానం 75 శాతం పూర్తయిందని తెలిపారు. కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించి 14,131 ఎపిక్ కార్డులు వచ్చాయని వాటిని పోస్టాఫీస్ ద్వారా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రెండోవిడతకు సంబంధించి 9 వేల కొత్త ఎపిక్ కార్డులు డౌన్‌లోడ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. జిల్లాలో ఫొటో సిమిలర్ ఎంట్రీస్ (పీఎస్‌ఈ)లు 8,460 ఉన్నాయని, క్షేత్రస్థాయిలో విచారణ చేస్తామన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జనవరి 25న జిల్లాలో నిర్వహిస్తామని, ఎన్నికల సంఘం ఆదేశాలు పాటిస్తూ.. జిల్లాలోని అన్ని బూత్‌ల్లోనూ ఓటర్లను చైతన్యవంతులను చేసే కార్యక్రమాలు చేపడతామని కలెక్టర్ వివరించారు. అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, ఆర్డీవో టి.శ్రీనివాస్‌రావు, తహసీల్దార్లు విజయ్‌కుమార్, రాజిరెడ్డి, డీఆర్‌డీఏ ఏపీవో నర్సింహులు, ఎన్నికల విభాగం డెప్యూటీ తహసీల్దార్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

వేములవాడరూరల్: కంటివెలుగు క్యాంపుపై ప్రజలకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలని కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. వేములవాడరూరల్ మండలం హన్మాజిపేట రైతువేదికలో ఏర్పాటు చేసిన క్యాంపును శుక్రవారం సందర్శించారు. మరో పది రోజులపాటు హన్మాజిపేటలో క్యాంపు కొనసాగుతుందని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామంలోని హైస్కూల్‌లో నిర్మాణంలో ఉన్న డైనింగ్‌హాల్, కాంపౌండ్‌వాల్ పనులను పరిశీలించారు. హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థిని జంకె శ్రీనిధిని కలెక్టర్ అభినందించారు. ఇన్‌స్పైర్ మానక్‌లో భాగంగా శ్రీనిధి బోండా తయారీ మిషన్‌ను తయారు చేసిన విషయం తెలిసిందే. డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, తహసీల్దార్ రాజు ఉన్నారు.

ఇటుకబట్టీల్లోని పిల్లలకు బడి పాఠాలు

- డీఈవో రాధాకిషన్



వర్క్‌సైట్ స్కూల్‌ను పరిశీలిస్తున్న డీఈవో

సిరిసిల్లఎడ్యుకేషన్: ఇటుకబట్టీలలో పనిచేసే కార్మికుల పిల్లలకు విద్యాబోధనకు వర్క్‌సైట్ స్కూల్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాధికారి రాధాకిషన్ తెలిపారు. సెక్టోరల్ అధికారి శైలజ, మండల విద్యాధికారి రఘుపతి, సీఆర్పీ రవికిరణ్ శుక్రవారం ఇటుకబట్టీల దగ్గర తనిఖీ చేశారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు శివారు ప్రాంతంలో ఇటుకబట్టి కార్మికుల పిల్లల కోసం నాలుగు వర్క్‌సైట్ స్కూళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాలుగు వర్క్‌సైట్ స్కూళ్లలో 56 మంది పిల్లలు చదువుకుంటున్నారు. ఒక్కో స్కూల్‌లో ఒక్కో విద్యావలంటీర్‌ను నియమించినట్లు తెలిపారు. ప్రతి రోజూ రగుడు స్కూల్ నుంచి మధ్యాహ్న భోజనం అందజేస్తామన్నారు. పిల్లలకు యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు సమకూర్చుతామన్నారు.

అంతర్‌రాష్ట్ర సైబర్ నేరగాడి పట్టివేత

- ట్రస్టు పేరుతో వసూళ్లు
- ఆంధ్రప్రదేశ్‌లోని నూజివీడులో పట్టుకున్న జిల్లా పోలీసులు



పవన్ చైతన్య

సిరిసిల్లక్రైం: సహాయం చేస్తానని చెప్పి ట్రస్టు పేరుతో డబ్బులు స్వాహాచేసిన అంతర్ రాష్ట్ర సైబర్ నేరగాన్ని జిల్లా పోలీసులు పట్టుకున్నారు. వివరాలను ఎస్పీ రాహుల్‌హెగ్డే శుక్రవారం వెల్లడించారు. వేములవాడరూరల్ మండలం నూకలమర్రికి చెందిన వేముల రాజశేఖర్ గతేడాది జూలై 18న తన తల్లికి చికిత్సకు ఆర్థిక సహాయం కోసం ఫేస్‌బుక్‌లో వీడియో పోస్ట్ చేశారు. అప్పుడు ఒకరు రాజశేఖర్‌కు ఫోన్ చేసి, చికిత్స కోసం 'అమ్మ ట్రస్ట్' పేరిట రూ.4 లక్షలు ఇస్తానని నమ్మించాడు. ఆ మొత్తం అందించడానికి ముందుగా డిపాజిట్ చేయాలని సూచించాడు. పవన్ అడిగినట్లు రూ.14వేలు ఇస్తే వచ్చే రూ.4లక్షలతో తల్లికి వైద్యం చేయించవచ్చని ఆశపడి.. గూగుల్‌పేతో డబ్బులు పంపాడు. డబ్బులు ట్రాన్స్‌ఫర్ కాగానే సదరు వ్యక్తి రాజశేఖర్ నంబర్‌ను బ్లాక్ చేశాడు. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు వెంటనే వేములవాడరూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నేరగాన్ని పట్టుకునేందుకు వేములవాడరూరల్ సీఐ బన్సీలాల్, స్పెషల్ టీమ్ దర్యాప్తు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా నూజివీడు మండలం నర్సుపేటలో నివసించే జలం పవన్‌చైతన్యగా గుర్తించారు. సీఐ బన్సీలాల్, ప్రత్యేక బృందం సభ్యులు అక్కడికి వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మోసగాడిని పట్టుకొని, అతని నుంచి రూ.14 వేలు, రెండు బ్యాంక్ పాస్‌పుస్తకాలు, మొబైల్‌ఫోన్ శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. మోసగాడి బారిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో చాలా మంది పడ్డారని పోలీసుల విచారణలో తేలింది. సహాయం చేసే వారు ముందుగా డబ్బులు అడగరని, అలాంటి వారి మాటలు విని మోసపోవద్దని ఎస్పీ రాహుల్ హెగ్డే కోరారు.

మానేరుతీరం.. జాతరపర్వం

- నేడు సిరిసిల్లలో మూడు జాతర్లు
- వాగుతీరం గ్రామాల్లోనూ సందడి

సిరిసిల్లటౌన్/ఎల్లారెడ్డిపేట/కోనరావుపేట: రాజన్నసిరిసిల్ల జిల్లావ్యాప్తంగా ప్రవహించే మానేరునది తీరాన శనివారం జాతర్ల సందడి కనిపించనుంది. మానేరుతీరం వెంట వెలసిన ఆలయాల్లో మాఘం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేసేందుకు ప్రజలు ఉదయం నుంచే బారులు తీరనున్నారు. మానేరునదిలో పుణ్యస్నానాలు చేసి, సమీప ఆలయాల్లో మొక్కులు చెల్లించనున్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో గంగాభవాని, మడేలేశ్వరస్వామి, రామలింగేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో జాతరలు నిర్వహించనున్నారు. గంభీరావుపేట మండలంలోని భీమునిమల్లారెడ్డిపేటలోనూ ప్రకృతి సోయగాల మధ్య జనజాతర సందడిగా మారనుంది.

కళ్యాణ వైభోగం

- సిరిసిల్ల శివారు గుట్టల్లో ఉన్న రామప్పగుడిలో రామలింగేశ్వరస్వామి కల్యాణవేడుకలను నాయీబ్రాహ్మణ సంఘం అనాదిగా చేపడుతోంది. ప్రస్తుతం ఈ ఆలయం మిడ్‌మానేరు ముంపు జలాల్లో మునిగింది. సమీప ప్రాంతంలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో వేదికను ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.
- సిరిసిల్ల మానేరునది తీరాన మూడు దశాబ్దాల క్రితం మడేలేశ్వరుని ఆలయాన్ని రజకులు నిర్మించారు. అప్పటి నుంచి ఏట శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నారు.
- రూ.5లక్షలు వెచ్చించి ఏర్పాట్లు చేశారు.
- ఎల్లారెడ్డిపేట మండలంలోని అక్కపల్లిలో గల బుగ్గరాజేశ్వరస్వామి ఆలయంలో మాఘం అమావాస్య జాతరకు ఏర్పాట్లు చేశారు. ఎల్లారెడ్డిపేట నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బుగ్గరాజేశ్వరస్వామి ఆలయం వరకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేకంగా బస్సులు నడిపిస్తారు. ఇక్కడి గుండంలోకి ఏడాదిపాటు ఊట రూపంలో నీరు వస్తుంటుంది. ఎల్లారెడ్డిపేటలోని శ్రీలక్ష్మీకేశవ పెరుమాండ్ల ఆంజనేయస్వామి, నారాయణపూర్ శివారులోని మానేరు వాగులో గల ఆంజనేయస్వామి, పదిర శివారులోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాల్లో జరిగే జాతరలకు ఏర్పాట్లు చేశారు.
- కోనరావుపేట మండలం మామిడిపల్లిలోని రాజన్న దత్తత శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో జరిగే ఉత్సవాలకు ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. కోవిడ్ ప్రభావంతో గతేడాది దుకాణాలకు అనుమతించని అధికారులు ఈసారి ఏర్పాటుకు అవకాశం కల్పించారు. తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, నీడ వసతుల పనులను ఎంపీపీ చంద్రయ్య, ఎంపీడీవో రామకృష్ణ, సర్పంచ్ భారత పర్యవేక్షించారు.
- కోనరావుపేట మండలంలోని నాగారంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయంలో మాఘం మాస్య జాతరకు, అన్నదానానికి ఏర్పాట్లు పూర్తయినట్లు ఆలయ కమిటీ బాధ్యులు చెన్నమనేని శ్రీకుమార్ తెలిపారు. కొలనూర్‌లో లొట్టగుట్ట రామలింగేశ్వర ఆలయంలో, ధర్మారంలో వెంకటేశ్వర ఆలయంలో జాతర ఉత్సవాలు జరుగనున్నాయి.



అక్కపల్లిలోని బుగ్గరాజేశ్వరస్వామి ఆలయం



సిరిసిల్లలోని మడేలేశ్వరస్వామి ఆలయం

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం భీమునిమల్లారెడ్డిపేట శివారులో ఎత్తయిన గుట్టపై తొమ్మిది అడుగుల ఆంజనేయ మూలవిగ్రహం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. ఇదే ఆవరణలో సీతారాముల, శ్రీవేంకటేశ్వస్వామి ఆలయాలు ఉన్నాయి. పాండవులు వనవాస సమయంలో భీముడు ఈ ప్రాంతంలో తిరిగినట్లు స్థలపురాణం చెబుతోంది. ఇందుకు సాక్ష్యంగా భీముడు నెత్తితో ఎత్తిన గుహ, పాదముద్రలు ఇప్పటికీ కనిపిస్తున్నాయి.

మాఘమాసం..శుభప్రదం

సిరిసిల్ల పట్టణాన్ని ఆనుకుని ప్రవహించే మానేరునదిలోని గంగమ్మ ఆలయంలో గంగపుత్రులు, రామప్ప(ప్రస్తుతం మిడ్ మానేరు ముంపులో ఉంది) ఆలయంలో నాయీబ్రాహ్మణులు, మానేరుతీరాన వెలసిన మడేలేశ్వర ఆలయంలో రజకుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవాలు నిర్వహించనున్నారు.

మొగిపురుగుతో మొదటికే మోసం !



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్‌కు చెందిన మోతె కిషన్‌రెడ్డి. తనకున్న నాలుగున్నర ఎకరాల్లో వరిపంట సాగుచేశాడు. నాటువేసి 25 రోజుల్లోనే మొగి(కాండం తొలిచే)పురుగు పంటపై ప్రభావం చూపడంతో మొత్తం బూడిదరంగుగా మారింది. పంటల సాగు కోసం అప్పులు చేసిన ఈ రైతుకు మళ్లీ పురుగుల నియంత్రణకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పంటవేసిన మొదట్లోనే వైరస్ ప్రభావం చూపడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. ఈ పరిస్థితి జిల్లాలోని చాలా మంది రైతులు ఎదుర్కొంటున్నారు.

- అన్నదాత.. ఆగమాగం
- బూడిదరంగుగా మారుతున్న పంట
- వాతావరణ మార్పులే ప్రధాన కారణం
- జిల్లా వ్యాప్తంగా 1.45 లక్షల ఎకరాల్లో వరిసాగు



కాండం తొలిచే పురుగుతో రంగుమారిన వరి

జిల్లాలో పంటల వివరాలు

సాగుభూములు	:	2.80లక్షలు
వరి పంట విస్తీర్ణం	:	1.45 లక్షలు
జిల్లాలో రైతులు	:	1.30లక్షలు
ఎకరం పంట సాగుకు వ్యయం	:	రూ.25వేలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లాలోని చెరువులు, కుంటల ఆయకట్టు భూముల్లో వరి పంట సాగుచేశారు. వరి నాట్లు వేసిన నెల రోజుల్లోపే పంటపై మొగిపురుగు(కాండం తొలిచే పురుగు) దాడి చేయడంతో పైరు ఎండిపోయి బూడిదరంగుగా మారుతోంది. పంట తొలిదశలోనే వైరస్ ప్రభావం చూపుతుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

1.45 లక్షల ఎకరాలలో వరి సాగు

జిల్లా వ్యాప్తంగా 1.45 లక్షల ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. ఎకరాకు దాదాపు రూ.25వేల వ్యయంతో పంటలు వేసిన అన్నదాతలకు మొదట్లోనే వైరస్ ఇబ్బందులకు గురిచేస్తోంది. వరిని వెంటాడుతున్న కాండంతొలిచే పురుగు నుంచి పంటను కాపాడుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. మొన్నటి వరకు చలి నుంచి నారు మడులను కాపాడుకోవడానికి ఇబ్బందిపడ్డ అన్నదాతలు ఆ గండం నుంచి గట్టెక్కామని నాట్లు వేసి ఊపిరి పీల్చుకున్న క్రమంలోనే మహమ్మారి వైరస్‌తో ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

వాతావరణంలో మార్పులతోనే..

జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో రైతులు విస్తారంగా వరి సాగుచేశారు. చెరువులు, కుంటలు నీళ్లతో నిండిపోగా వాటి ఆయకట్టు పరిధిలోని ఒకప్పటి బీడు భూములను సాగులోకి వచ్చాయి. గతేడాది సీజన్‌లో వరిపంటను సాగుచేయొద్దని ఆరుతడి పంటలపైనే దృష్టి సారించాలని ప్రభుత్వం రైతులకు సూచించడంతో పత్తి పంట సాగుపై దృష్టి పెట్టారు. అయితే రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని ప్రభుత్వ ప్రకటించడంతో రైతులు వరిపంటపైనే మొగ్గు చూపారు. సాగునీరు పుష్కలంగా ఉండడంతో ముందుగానే నారుమడులను సిద్ధం చేసుకుని నెల రోజుల నుంచే వరినాట్లను ప్రారంభించారు. వరినాట్లు వేసి ఊపిరి పీల్చుకున్న రైతుకు ఆ వెను వెంటనే వాతావరణంలో మార్పులతో కాండం తొలిచే పురుగు పైరుకు తాకడంతో కింది కాండాన్ని తొలచివేసే ప్రమాదం ఉండడంతో దిగుబడులు వచ్చే పరిస్థితులు ఉండబోవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులు పురుగు ప్రభావంపై గ్రామాల్లో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

పంటల మార్పిడితో రోగాలకు చెక్

రైతులు పంటల మార్పిడిపై దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. కేవలం వరి పంటపైనే మొగ్గు చూపుతూ అందరూ ఒకే రకమైన పంటను సాగుచేయడంతో వైరస్‌లు ప్రభావం చూపుతాయని అధికారులు అంటున్నారు. ఎటుచూసిన కనుచూపు మేరలో వరుసగా వరి పంటనే ఉండడంతో తెగుళ్లు సోకి మొత్తం విస్తీర్ణంలోని పంటలను దెబ్బతీసే పరిస్థితి ఉంది. అయితే పంటల మార్పిడితో వరిపంటకు మధ్యలో వేరే పంటలు సాగుచేస్తే ఈ వైరస్ ప్రభావం కేవలం వరి పంట వరకే ఆగిపోతుందని అధికారులు పేర్కొంటున్నారు. పంటల మార్పిడిపై రైతులకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కల్పించిన వారు పట్టించుకోవడం లేదు. మొత్తంగా పరిస్థితుల నుంచి రైతులు గట్టెక్కడానికి ప్రభుత్వం ఉచితంగా క్రిమిసంహారక మందులు, ఎరువులు అందించాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

పంటను కాపాడాలి



వరి పంటలకు వస్తున్న కొత్త కొత్త వైరస్‌ల(రోగాల) నుంచి పంటను వ్యవసాయాధికారులు కాపాడాలి. పంటలకు వచ్చే రోగాలపై అవగాహన కల్పించాలి. పురుగు మందు పిచికారీపై రైతుకు వివరించాలి. ప్రభుత్వమే క్రిమిసంహారక మందులు, ఎరువులు అందించి ఆదుకోవాలి. ఒక ఎకరాకు రూ.25వేల చొప్పున ఖర్చు చేయాల్సి వస్తుంది. **– ఉల్లి బాలయ్య, రైతు, దుమాల**

వాతావరణ మార్పులతోనే..



వాతావరణంలో వస్తున్న మార్పులతోనే కాండం తొలిచే పురుగు వరి పైరుపై ప్రభావం చూపుతోంది. వైరస్ నివారణకు ఎకరాకు కార్బోఫ్యూరన్ త్రీజీ పది కిలోలు లేదా కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ ఎనిమిది కిలోల చొప్పున చల్లాలి. గుళికలతో వైరస్ అంతమవుతుంది. రైతులు ఈ పరిస్థితులు తలెత్తకుండా పంటల మార్పిడిపై దృష్టి సారించాలి. **– చాడ భూంరెడ్డి, మండల వ్యవసాయాధికారి, ఎల్లారెడ్డిపేట**

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభను చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్-19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్-25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
95055 14424, 99124 40790
గమనిక : అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

క్లుప్తంగా

చెరువు సాక్షిగా వరిసాగు



బోయినపల్లి(చొప్పదండి): కనుచూపు మేర చెరువునీరు.. నీటి వెంబడి వరిపంటల సాగుతో పచ్చగా కనిపిస్తుంది. ఈ చిత్రం బోయినపల్లి మండలం విలాసాగర్ పెద్దచెరువు పరిసరాల్లో కనిపిస్తుంది. చెరువు విస్తీర్ణం 198 ఎకరాల్లో ఉండగా.. చెరువు కింద 688 ఎకరాల ఆయకట్టులో రైతులు వరిపంట సాగు చేశారు.

ఏఐటీయూసీ నుంచి నర్సయ్య బహిష్కరణ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఏఐటీయూసీ మండల సంఘం నుంచి మర్కంటి నర్సయ్యను సస్పెండ్ చేసినట్లు క్రవారం జిల్లా అధ్యక్షుడు వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు శుక్రవారం ప్రకటించారు. హమాలీ సంఘానికి వ్యతిరేకంగా పనిచేస్తూ కార్మికులను చీల్చే ప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో నర్సయ్యను బహిష్కరిస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

రెండో రోజు 3,620 మందికి పరీక్షలు

- క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన

సిరిసిల్ల: జిల్లాలో రెండో రోజు కంటి వెలుగు కార్యక్రమం శుక్రవారం కొనసాగింది. జిల్లాలోని 26 ప్రాంతాల్లో నేత్రవైద్యులు 3,620 మందికి కంటి పరీక్షలు చేశారు. కలెక్టర్ అనురాగ్ జయంతి వేములవాడ మండలం హన్మాజీపేటలో కంటివెలుగు శిబిరాన్ని సందర్శించారు. జిల్లా వైద్యాధికారితోపాటు జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచనలు చేస్తున్నారు.

శిబిరాల వద్దకు జనం

జిల్లా వ్యాప్తంగా అంధత్వ నిర్మూలనలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన కంటివెలుగు శిబిరాలకు జనం తరలివస్తున్నారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో 400 చొప్పున ఒక్కో శిబిరంలో పరీక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా.. 300 నుంచి 350 మంది వరకు వచ్చారు. పల్లెల్లోనూ 300 మందికి ఒక్కో శిబిరంలో కంటి పరీక్షలు చేయాలని ప్రణాళిక సిద్ధం చేయగా.. 150 నుంచి 250 మంది వరకు వచ్చారు.



సిరిసిల్లలో కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

జిల్లాలో పరీక్షల వివరాలు ఇలా..

శిబిరాలు	26
పాల్గొన్న వైద్య సిబ్బంది:	234
కంటి పరీక్షలు చేయించుకున్న వారు:	3,620
రీడింగ్ అద్దాలు పొందిన వారు:	1,081
పాయింట్ ఆర్డర్ అద్దాలు పొందిన వారు:	989

వంద రోజులకే తేలిన కంకర రాళ్లు !

- రూ.25 లక్షలు కంకరపాలు
- నాణ్యతపై మున్సిపల్ చైర్‌పర్సన్‌కు ఫిర్యాదులు

సిరిసిల్ల: సిమెంట్ రోడ్డు వేస్తే.. కనీసం ఏడాది పాటైన బాగుంటుంది. ఆ మార్గంలో ప్రయాణించే వారికి ప్రభుత్వం, అధికారులు, ఇంజినీర్లు చేసిన పనితో సౌకర్యం కలుగుతుంది. కానీ సిరిసిల్ల పట్టణ నడిబొడ్డున రూ.25 లక్షలతో మూడు నెలల కిందట వేసి సిమెంట్ రోడ్డు ఇప్పుడే కంకరతేలింది. పట్టణంలోని పోచమ్మ ఆలయం ముందు అంబేద్కర్‌నగర్‌కు వెళ్లే మార్గంలో సిమెంట్‌రోడ్డు వేశారు. వంద రోజులైన గడవకముందే సిమెంట్ చెదిరిపోయి కంకరరాళ్లు తేలాయి. మరో నెల రోజులైతే ఆ రోడ్డు కూడా పూర్తిగా శిథిలమవుతుంది. రోడ్డు నిర్మాణంలో పాటించాల్సిన కనీస ప్రమాణాలు పాటించకపోవడం, ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించకపోవడంతో సిమెంట్ రోడ్డు చెదిరిపోయింది. ఈ రోడ్డు నాణ్యతను నిలదీస్తూ స్థానికులు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఏది ఏమైన పది కాలాలపాటు ఉండాల్సిన సిమెంట్ రోడ్డు కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి, ఇంజినీర్ల పట్టింపులేనితనానికి అద్దం పడుతూ.. కంకర తేలి కనిపించడం దారుణం. తేలిన కంకర రాళ్లు.. అవినీతికి ఆనవాళ్లుగా కనిపిస్తున్నాయి.



సిరిసిల్ల పోచమ్మ ఆలయం ముందు కంకర తేలిన సిమెంట్ రోడ్డు

ప్రైవేట్‌స్కూళ్లలో అధిక ఫీజులపై బీజేపీ ధర్నా



ముస్తాబాద్‌లో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లో ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూళ్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేవైఎం మండలాధ్యక్షుడు కుడకల జనార్దన్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేపట్టారు. స్వామి వివేకానంద విగ్రహం వద్ద బీజేపీ నాయకులు రాస్తారోకో చేపట్టారు. వారు మాట్లాడుతూ ముస్తాబాద్‌లో ప్రైవేటు పాఠశాలల యజమానులు నిబంధనలకు విరుద్ధంగా అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఫీజులపై ఎలాంటి డిస్‌ప్లేలు చేయడం లేదన్నారు. తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు లాగుతూ బెదిరింపులకు గురిచేస్తున్నారన్నారు. ఎంఈవో బన్నాజీ వారితో ఫోన్‌లో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. బీజేపీ మండలాధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి, కోల కృష్ణ, క్రాంతి, మహేందర్, శంకర్, గోపి, నరేశ్, రమేశ్‌రెడ్డి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా మహాలింగార్చన



మహాలింగార్చన నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు, హాజరైన భక్తులు

వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో మాసశివరాత్రిని పురస్కరించుకుని ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం శుక్రవారం రాత్రి మహాలింగార్చన వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు.

వెల్ఫేర్‌బోర్డు ఏర్పాటు చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కోడం రమణ

సిరిసిల్లఅర్బన్: హమాలి కార్మికులకు వెల్ఫేర్‌బోర్డు ఏర్పాటుచేసి, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. హమాలీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 23న నిర్వహించే చలో కలెక్టరేట్ ధర్నాకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. హమాలీ కార్మికులు భద్రత లేని జీవితాన్ని గడుపుతున్నారన్నారు. వీరికి ప్రభుత్వం వెల్ఫేర్‌బోర్డును ఏర్పాటు చేయాలని, లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ధర్నాకు హమాలీ కార్మికులు హాజరుకావాలని కోరారు. రైతుబజార్ హమాలీ కార్మిక నాయకులు దుంపేటి సత్తయ్య, నర్సింగారావు, ధర్మయ్య, బాబు, నరేందర్, రమేశ్, శేఖర్ ఉన్నారు.



మహాజాతర ఏర్పాట్లు ముమ్మరం

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో మహాశివరాత్రి జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించుకునేందుకు జిల్లా అధికారులు, ఆలయ అధికారులు కసరత్తు చేస్తున్నారు. గుడిచెరువులో భక్తులు విడిది చేసేందుకు చలవపందిళ్లు, సీసీరోడ్డు, తాత్కాలిక మరుగుదొడ్లు, ప్రధానాలయంతోపాటు అనుబంధ ఆలయాలకు రంగులు వేశారు. చంటిపిల్లలకు పాలిచ్చేందుకు వీలుగా బేబీఫీడింగ్ సెంటర్, నిరంతర విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లు, ప్రధానాలయం, అనుబంధ ఆలయాలు, జాతరగ్రౌండ్ తోపాటు భక్తులు ఉండే ప్రాంతాల్లో చలవపందిళ్లు, క్యూలైన్లు సిద్ధం చేసి ఉంచారు.





మా నాన్నకు ప్రాణభిక్ష పెట్టండి

- 20 రోజులుగా కదలలేని స్థితిలోకి యువకుడు
- పాడయిన రెండు కిడ్నీలు
- వైద్యానికి రూ.10లక్షలు ఖర్చు అవుతుందన్న వైద్యులు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంతోష్



సాయమందించాలని వేడుకుంటున్న భార్య, పిల్లలు

కోనరావుపేట(వేములవాడ): రోజు కూలి పనులు చేసుకుంటూ భార్య, ఇద్దరు కూతుళ్లను పోషించుకుంటున్న యువకుడు అకస్మాత్తుగా అనారోగ్యంబారిన పడ్డాడు. ఆస్పత్రికి వెళ్తే రెండు కిడ్నీలు పాడయ్యాయని తెలిసింది. వైద్యానికి చేతిలో చిల్లిగవ్వలేని అతనికి రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నాడు. కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన మాందాల సంతోష్(28) గ్రామంలోనే కూలి పనులు చేసుకుంటూ భార్య మమత, ఇద్దరు కూతుళ్లను పోషించుకుంటున్నాడు. ఉన్నట్టుండి సంతోష్ అనారోగ్యానికి గురికాగా అతని భార్య మమత కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడ పరీక్షలు నిర్వహించిన వైద్యులు రెండు మూత్రపిండాలు పాడయ్యాయని, ఖరీదైన వైద్యం చేయించాలని సూచించారు. ఇందుకు రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని వివరించారు. దీంతో చేసేదేమీలేక భర్తను ఆస్పత్రిలోనే ఉంచి తాత్కాలికంగా డయాలసిస్ అందిస్తోంది.

ప్రాణభిక్ష పెట్టండి

రెక్కాడితే గానీ డొక్కాడని బతుకు.. కూలి పనులు చేసి మమ్మల్ని పోషించే భర్త చికిత్సకు రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని మమత తెలిపింది. వారికి ఇద్దరు కూతుళ్లు. ఏమిచేయాలో అర్థంకాక 20 రోజుల నుంచి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. దాతలు ఆదుకుని తన భర్త ప్రాణాలు కాపాడాలని మమత వేడుకుంటోంది.

సంతోష్ గూగుల్ పే, ఫోన్‌పే నంబర్ : 86868 61639